ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 10 జూన్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38 (సోమవారం)
కనిష్ఠం : 29

ప్రతిభకు పట్టం!

» కొత్త విద్యా సంవత్సరంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి : కలెక్టర్ మహేష్‌కుమార్

» జిల్లాలో పది, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

» 168 మందికి షైనింగ్‌స్టార్-2025 అవార్డుల ప్రదానం



విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు, సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



షైనింగ్ అవార్డు గ్రహీతతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు, సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్డీవో మాధవి, పక్కన ఎమ్మెల్యే గిడ్డి, కలెక్టర్

అమలాపురం, జూన్9(ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు మరింత కృషిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. అమలాపురం సత్యనారాయణగార్డెన్స్‌లో సోమవారం జిల్లాస్థాయి షైనింగ్‌స్టార్ 2025 అవార్డులను 168 మంది విద్యార్థులకు అందించి సత్కరించారు. జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించి పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 139 మంది ఇంటర్మీడియట్ 29 మంది విద్యార్థులను ఎంపికచేసి ఒక్కొక్కరికీ రూ.20 వేలు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ప్రత్యేక అవసరాలు గల పిల్లల కేటగిరిలో ప్రతిభావంతులను ఎంపిక చేశామన్నారు. ఈ ఏడాది విద్యార్థుల సామర్థ్యాన్ని ఏబీసీ కేటగిరిలుగా విభజించి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా జిల్లాను రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిపామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి కరిక్యులమ్‌లో మార్పులు చేస్తూ జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఇదే ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు నాగమణి మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్రంలో జిల్లా 14వస్థానంలో ఉండగా ఈ ఏడాది కలెక్టర్ ప్రత్యేక చొరవతో రెండో స్థానంలోకి తీసుకువచ్చామన్నారు. తొలుత వేదికపై ప్రతిభావంతులైన విద్యార్థుల ప్రతిభకు గల కారణాలను వారి ద్వారానే అందరికీ వివరించేలా కలెక్టర్ మహేష్‌కుమార్ వారితో మాటామంతీ నిర్వహించారు. అనంతరం అవార్డులు అందుకున్న విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి వనుము సోమశేఖరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ, బీర హనుమంతరావు, బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వినతుల రికార్డు!

గత ఐదేళ్లు ప్రజలు పరేషన్



గత వారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ వద్ద అర్జీదారుల క్యూ (ఫైల్)

» రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
» ఉమ్మడి తూ.గో.జిల్లాలో ప్రజల క్యూ
» 1.27 లక్షల దరఖాస్తులు
» కొత్తకార్డులకు 10,555
» సభ్యులను చేర్చాలంటూ 97,886
» వైసీపీ పాలనలో నో ఛాన్స్
» ప్రస్తుత ప్రభుత్వంలో అవకాశం
» భారీగా వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



రేషన్‌కార్డులటి జనం క్యూకడుతున్నారు.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కొత్తరేషన్ కార్డుల మంజూరు, అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలంటూ భారీగా దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎడాపెడా కార్డుల్లో కోత, అడ్డగోలుగా రద్దు.. కొత్తవారిని చేర్చకపోవడంతో వేలాది మంది నరకయాతన పడ్డారు. ప్రభుత్వం మారాక కార్డుదారులపై సీఎం చంద్రబాబు కరుణ చూపారు. ఆరేళ్ల తర్వాత అవకాశం దక్కడంతో జనం నుంచి భారీగా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఏకంగా 1,27,533 మంది అర్జీలు పెట్టుకున్నారు. కొత్తకార్డులకు 10,555 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలంటూ 97,886 మంది విజ్ఞప్తులు చేశారు. అత్యధికంగా ఒక్క తూర్పుగోదావరి నుంచే 43,189 దరఖాస్తులు వచ్చాయి.

అప్పుడంతా అరాచకమే..

వైసీపీ ఐదేళ్ల పాలన..సంక్షేమ పథకాల అమల్లో కోతలే కోతలు అన్నట్టు సాగింది. రకరకాల నిబంధనలతో రేషన్ కార్డులను వేలల్లో ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాలశాఖకు పంపిగుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. ప్రధానంగా 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో రద్దుచేశారు. వాస్తవానికి వీరంతా పొట్టకూటి కోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు తాత్కాలిక వలస వెళ్లినవారే. ప్రజలు అప్పట్లో నిర్వహించిన స్పందనలో కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయా లంటూ అనేకసార్లు భారీగా వినతులు ఇచ్చారు. అయినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. దీంతో అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది. ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను గుర్తుంచుకుని పరిష్కారం కోసం ఆలోచించారు. పౌరసరఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చ జెండా ఊపారు. గత నెల 14 నుంచి సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డులకు అర్జీలు స్వీకరిస్తున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులకు ఏడు రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఆరేళ్ల తర్వాత అవకాశం రావడంతో ప్రజలు క్యూకడుతున్నారు. ఎక్కడ చూసినా కార్డుల హడావుడే.

అత్యధికం అవే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటివరకు 1,27,533 మంది నుంచి వినతులు వచ్చాయి. అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఎక్కువ. ప్రధానంగా తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా 43,189 అర్జీలు వచ్చాయి. వీటిలో రేషన్ కార్డుల్లో తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 32,942 మంది మొర పెట్టుకున్నారు. బియ్యం కార్డులు విభజించాలంటూ 3,302 మంది, 3,684 మంది కొత్త కార్డులు కావాలని అర్జీలు అందించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 42,805 మంది వినతులు అందించారు. ఇందులో కొత్తకార్డులు మంజూరు చేయాలని 3,526 మంది, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యులను చేర్చాలని 32,852 మంది దరఖాస్తు చేసుకున్నారు. కోనసీమ జిల్లాలో మొత్తం 41,539 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చాలని 32,092 మంది, కొత్త కార్డులకు 3,345 మంది దరఖాస్తులు చేశారు. ఇలా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలన చేయనున్నారు. సచివాలయాల స్థాయిలో వీఆర్వోల నుంచి తహశీల్దార్ల వరకు ఆయా అర్జీలను విభాగాల వారీగా పరిశీలించి మార్పులు, చేర్పుల ప్రక్రియ చేపట్టనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు గడువు లేదని నిరంతరం కొనసాగిస్తామని కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చే మాట చెప్పింది.

జిల్లాల వారీగా దరఖాస్తుల వివరాలిలా..

అర్జీ విభాగం	కాకినాడ	తూగోజీ	కోనసీమ
కార్డుల్లో చిరునామా మార్పు	1,447	1501	1387
ఆధార్‌సీడింగ్‌లో తప్పుల దిద్దుబాట్లు	368	387	356
కొత్తగా సభ్యులను చేర్చడం	32,852	32,942	32,092
కొత్తకార్డుల మంజూరు	3,526	3,684	3,345
కార్డుల తొలగింపు	1,294	1,348	1,154
బియ్యంకార్డుల విభజన	3,296	3,302	3,187
రేషన్‌కార్డుల సరెండర్	22	25	18
మొత్తం	42,805	43,189	41,539

ధాన్యం సొమ్ములు ఏవీ..



» 30 రోజులుగా పడని సీఎంఆర్ పేమెంట్లు

» ధాన్యం విక్రయించిన రైతులు విలవిల

కె.గంగవరం, జూన్9(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు మద్దతు ధరతోపాటు సకాలంలో సొమ్ములు చెల్లించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యం. దానికి అనుగుణంగానే కొంతమేర ధాన్యం విక్రయించిన కొన్ని గంటల్లోనే సొమ్ములు జమ చేసి ఔరా అనిపించుకుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా సీఎంఆర్‌కు ధాన్యం విక్రయిస్తే అదే రోజు రైతుల ఖాతాల్లో సొమ్ములు వేస్తున్నామని, వేస్తామని కూటమి ప్రభుత్వం నొక్కి మరీ చెప్పింది. ఆవిధంగానే ఈ రబీ సీజన్‌లో తొలుత కొన్ని రోజులపాటు ధాన్యం సీఎంఆర్‌లో విక్రయించిన రోజునే రైతు ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. దీంతో చాలా మంది రైతులు ఆనందపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం విక్రయించిన 21 రోజులకు సొమ్ము జమచేస్తామని చెప్పి నెలలు గడిచినా ధాన్యం సొమ్ములు జమచేయని దుస్థితి ఉండేది. సీజన్ మారి కొత్త పంటకు సిద్ధమవుతున్నా సొమ్ములు జమయ్యేవి కాదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీరోడేస్ పేమెంట్ అంటే ధాన్యం విక్రయించిన రోజునే రైతుఖాతాల్లో సొమ్ములు జమ చేసేశారు. దీంతో రైతులంతా సీఎంఆర్ విధానంలోనే ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి విక్రయించారు. గత నెల 10వ తేదీ వరకూ విక్రయాలు చేసిన రైతులకు ఆవిధంగానే సొమ్ములు జమ అయ్యాయి. కానీ గత నెల 11వ తేదీ నుంచి సీఎంఆర్‌లో విక్రయాలు చేసిన రైతులకు ధాన్యం సొమ్ములు పెండింగ్‌లో పడ్డాయి. సుమారుగా 30 రోజులుగా రైతులు ఖాతాల్లో సొమ్ము జమకాలేదు. రైతులు నేడో, రేపో అంటు ఎదురుచూస్తున్నారు. ఒకపక్క తొలకరి పంట సాగు చేసుకునే సమయం ఆసన్నమైంది. ప్రభుత్వం పంట కాలువలకు సాగునీరు విడుదల చేసింది. ప్రతీ రైతు ఈవారంలో ఆకుమడులు వేసుకోవాలి. కానీ ప్రభుత్వం రబీ పంటకు సంబంధించి ఇప్పటివరకూ సొమ్ములు జమ చేయకపోడంతో రైతులు గత పంట అప్పులు తీర్చలేక, ఇప్పుడు ఖరీఫ్‌కు పెట్టుబడులు ఎలా పెట్టాలని తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో గత 30 రోజులుగా సీఎంఆర్ పేమెంట్లు పడటం లేదు. ఈ రబీలో సీఎంఆర్ విధానంలో 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం సేకరించింది. దీనిలో 1.58 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.364కోట్లు రైతులకు జమ చేసింది. ఇంకా 1.02 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.233 కోట్ల వరకూ రైతులకు జమ చేయాలి. గత నెల నుంచి ధాన్యం విక్రయించిన సొమ్ములు నేటికీ జమ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సమస్యను గుర్తించి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రైతులకు ధాన్యం సొమ్ములు జమ అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



గోదావరి భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు జిల్లాస్థాయిలో 217 అర్జీలు

అమలాపురంటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు మండల స్థాయి సమస్యలను మండల స్థాయిలోనే నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీలు అందించి పరిష్కార మార్గాలు పొందాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. జిల్లా స్థాయి ఫిర్యాదులను జిల్లా స్థాయిలో అందించాలన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ని ర్వహించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ తోపాటు డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌లు అర్జీదారుల నుంచి 215 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్నందున ఈ అవకాశాన్ని క్షేత్రస్థాయిల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా వైద్యసేవల సమన్వయకర్త డాక్టర్ కార్తీక్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 30..

అమలాపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 30 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. సకాలంలో సమస్యలను పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు.



అర్జీదారుల సమస్య వింటున్న కృష్ణారావు

పురాతన శైవక్షేత్రం భీమేశ్వరాలయంలో యోగాంధ్ర

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి : మంత్రి సుభాష్.. ద్రాక్షారామలో యోగాభ్యాసన







యోగాసనాలు వేస్తున్న మంత్రి సుభాష్, జేసీ నిశాంతి.. పాల్గొన్న జనం.. యోగ ముద్ర కూర్పుగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు

ద్రాక్షారామ,జూన్ 9(ఆంధ్రజ్యోతి):ప్రాచీన భారతీయ సంపద యోగా ప్రతీ ఒక్కరి జీవితంలో భాగం కావాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రాచీన శైవ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాభ్యాసన కార్యక్రమం వందలాది మందితో ఆహ్లాదకరంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ మన ప్రాచీన సంపద యోగాను అందరి జీవితంలోకి తీసుకువచ్చేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు యోగాంధ్ర కార్యక్రమం రూపొందించారన్నారు. జేసీ నిశాంతి మాట్లాడుతూ భీమేశ్వరాలయంలో యోగ కార్యక్రమం మన సంస్కృతి, ఆరోగ్యం కలసి పోవడాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ముందుగా పీఠికాపుర యోగ విద్యా పీఠం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలతో కూడిన సాంస్కృతిక ప్రదర్శన, జెడ్పీహెచ్ఎస్ ద్రాక్షారామ బాలికలు ప్రదర్శించిన కార్యక్రమం, నల్లూరు పాఠశాల విద్యార్థుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ యోగా గురువులు సి.రామచంద్ర ఆధ్వర్యంలో యోగాభ్యాసన జరిగింది. ఆర్డీవోలు రాజకుమారి, అఖిల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దొర, ఇండ్రస్ట్రీస్ జీఎం ప్రసాద్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

'ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి కృషి'

అమలాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక అసమానతలు లేని సమాజ స్థాపన దిశగా సమష్టిగా పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. స్వర్ణాంధ్ర దార్శినికతకు అనుగుణంగా ఆశించిన వృద్ధి రేటును సాధించేలా జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో ఉన్న వనరుల ఆధారంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అసమానతలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా దార్శినికత యూనిట్లను సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలనతో పాటు అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటుచేసి రాష్ట్రాన్ని అభ్యుదయపథంలో నడిపించేలా యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్యకర సమాజ స్థాపన, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ తదితర ఫౌండేషన్ల ద్వారా సమాజంలో వృద్ధిరేటు సాధన, ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి, సీపీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ , ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

శెహబాస్.. స్టూడెంట్స్

ప్రభుత్వ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు మంచి మార్కులు వస్తే.. పాఠశాలలో తప్ప.. జిల్లా కేంద్రాలకు పిలిచి అభినందించడం ఎప్పుడైనా చూశామా.. ఎక్కడైనా విన్నామా.. సాక్షాత్తూ మంత్రులే వచ్చి వెల్‌డన్ అంటూ దీవించి మీకు మేమున్నాం.. చదువుకోండంటూ మాట ఇచ్చిన ఘటనలు ఉన్నాయా.. గతంలో ఎప్పుడూ లేవు.. తాజాగా కూటమి ప్రభుత్వంలో కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో సుమారు 505 మంది విద్యార్థులను అభినందించారు. ఒక్కొక్కరికీ రూ.20 నగదు.. మెడల్‌తో ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు.. ఇది చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందించారు.



మాట నాణ్యత కలిగిన పాలన.. బ్యాగ్‌లతో మంత్రి నిమ్మల



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఆర్డీవో మాధవి



కాకినాడలో విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యే కొండబాబు

శుభకార్యాలకు విరామం

నేటి నుంచి మూఢం, 26 నుంచి ఆషాఢ మాసం

పెద్దాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వివాహ సీజన్ జనవరి 30 నుంచి జూన్ 7 వరకు జోరుగా సాగింది. ఈ నెల 10వ తేదీ నుంచి గురు మౌఢ్యమి, 26న ఆషాఢ మాసం ప్రారంభం కానుండడంతో వివాహాది శుభకార్యాలకు 48 రోజుల పాటు విరామమే.



దీంతో శుభకార్యాల్లో సందడి చేసే డోలు, సన్నాయి మూగబోనున్నాయి. మాంగల్యం తంతునానేన అంటూ పెళ్లి మంత్రాలు చదివే పురోహితులు మౌన వ్రతం చేపట్టాల్సిందే. వంట మేస్త్రీలు, పుష్పాలంకరణ చేసేవాళ్లు, క్యాటరింగ్ సిబ్బంది, లైటింగ్, డెకరేషన్ వారు, కల్యాణ మండపాల యజమానులు విశ్రాంతి తీసుకోవాల్సిందే.

ఈ నెల 10 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గురు మౌఢ్యమి కావడంతో వివాహాది శుభకార్యాలు జరగవని కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన ప్రముఖ జ్యోతిష సిద్ధాంతి చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ జ్యేష్ఠ మాసంలో మూఢమి రాకుంటే మరో 15 రోజులు వివాహాది శుభకార్యాలు జరిగేవన్నారు. ఆ తర్వాత ఆషాఢం శూన్య మాసం కావడంతో శ్రావణమాసంలో వచ్చే నెల 26వ తేదీ నుంచి వివాహాలు, ఇతర శుభకార్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

శుభ ముహూర్తాలు ఇవే...

జులై: 26, 30, 31

ఆగస్టు: 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17

సెప్టెంబరు: 23, 24, 26, 27, 28

అక్టోబరు: 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31

నవంబరు: 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27



అమలాపురంలోని ఓ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మహిళ

(అమలాపురం టౌన్-ఆంధ్రజ్యోతి)

మా అమ్మాయిని చూసుకోవడానికి అబ్బాయి తరపు వారు వచ్చారు. అన్నీ బాగానే ఉన్నాయి కానీ పిల్ల కాస్త బొద్దుగా ఉందని చెప్పి వెళ్లిపోయారని ఓ తండ్రి ఆవేదన. ఇలా ఎందుకు జరుగుతోందంటూ ఎక్కడ చూసినా ఒకటే చర్చ. దాంతో ఎందరో పెద్దలు మా చిన్నతనంలో... అంటూ సాగదీస్తూ అలనాటి ఆరోగ్య చిట్కాలను చెప్తుతున్నారు.

'ఫిట్‌నెస్' మంత్ర

- అందంతో పాటు ఆరోగ్యాన్నిచ్చే వ్యాయామం
- జిమ్‌ల బాట పడుతున్న యువతులు, మహిళలు



రిమ్... జిమ్ అంటున్న యువతి

నేడు ఇల్లు, వాకిలి నడుం వంచి తుడవాల్సిన పనిలేదు. బట్టలు బండకేసి బాదక్కర్లేదు. మినపప్పు రోలులో వేసి రుబ్బాల్సిన అవసరమూ లేదు. అన్నిటికీ యంత్రాలు వచ్చేశాయి. ఇవన్నీ ధనికుల ఇళ్లకు మాత్రమే పరిమితమనుకుంటే పొరపాటే. మధ్య తరగతి ఇళ్లల్లో కూడా మిషన్లు వచ్చి చేరిపోయాయి. దాంతో ఎందరో మహిళలకు, యువతలకు దైనందిన జీవితంలో కొనసాగుతూ వచ్చిన నిత్య వ్యాయామం తగ్గిపోయింది. దానికి తోడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు కంప్యూటర్లకు మాత్రమే పరిమితమయ్యే పనులు చేసే ఉద్యోగాల సంఖ్యా పెరిగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల మాదిరిగానే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు కూడా అంతే వేగంగా పెరుగుతూ వచ్చాయి. ఒళ్లు వంచి పనిచేసే ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆధునిక యువతులు, మహిళలు ఎందరో ఊబకాయంతో బాధపడుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితం వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హనుమాన్ వ్యాయామశాలలు మాత్రమే ఉండేవి. అవికూడా 90శాతం మేర పురుషులకే పరిమితమయ్యేవి. కాలక్రమంలో వచ్చిన మార్పులతో అత్యాధునిక జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆయా జిమ్‌ల్లో ప్రత్యేక శిక్షణలు పొంది నాజూకుగా తయారవ్వాలనే వారి సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతూ వస్తోంది.

90 రోజులు క్రమం తప్పకుండా చేయాలి

కంకిపాటి వెంకటేశ్వరరావు, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్, అమలాపురం



ఫిట్‌నెస్ నిలుపుకోవాలంటే ఎటువంటి వ్యాయామమైనా 90 రోజులు క్రమం తప్పకుండా చేయాలి. వ్యక్తి తీసుకునే ఆహారంలోని క్యాలరీలను ఖర్చు చేయగలిగే దానినే వ్యాయామం అంటారు. ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకోవాలి. కోడిగుడ్డులోని తెల్లటి సొన, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, మిల్క్‌బ్రెడ్, పచ్చరంగు పండ్లు, డ్రైఫ్రూట్స్ బాదం జిగురు (గోండ్ కటీరా) వంటి వాటిని ఆహారంగా తీసుకోవాలి.

అందం చెక్కుచెదరకుండా..

అందమే ఆనందం... ఆనందమే జీవిత మకరందం.. అన్నాడో సినీ కవి. వయసులో ఉన్నా, వయసు మీరినా అటువంటి అందాన్ని చెక్కు చెదరకుండా ఉంచుకునేందుకు నేటి తరం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఇందుకోసం మహిళలు, యువతులు పోటీపడుతున్నారు. కొందరు ఆరోగ్యంకోసమైతే, మరికొందరు ఫిట్‌నెస్ కోసం, ఇంకొందరు అందం కోసం. ఎవరి పాలసీ ఏదైనా అందరూ నేడు జిమ్‌ల వైపు పరుగులు పెడుతున్నారు. కాలం మారిందీ మైనరూ.. ఇక తగ్గాలి మీ జోరు.. అని సినీ కవి అన్నట్టుగా యువతులు యువకులతో పోటీపడుతూ శరీర సౌష్టవాన్ని కాపాడుకుంటున్నారు.



వ్యాయామ సాధనలో....

అన్ని సమస్యలకూ ఒకే రకం వ్యాయామం పనికిరాదు. ఒక్కో సమస్యకు ఒక్కో రకం వ్యాయామం ఎక్కువ ఫలితాన్నిస్తుంది. సమస్యలను బట్టి వ్యాయామాలను ఎంచుకుంటూ ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకోవచ్చునని వ్యాయామశిక్షకులు చెప్తున్నారు. మెరుపుతీగలా ఉండాలని యువతి కోరుకుంటుంది. కానీ ఆధునిక తిండ్లకు అలవాటుపడడంతోపాతికేళ్లకే ఒళ్లు కదిలించలేనంత లావుగా తయారవుతున్నారు. మరికొందరైతే చిరుప్రాయం నుంచే ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. వ్యాయామంతో పాటు అందుకు తగిన ఆహారం తీసుకుంటే ఊబకాయం నుంచి బయటపడవచ్చు. ఇటీవలి కాలంలో మహిళలు, యువతులు స్కిప్పింగ్‌తో శరీర సౌష్టవాన్ని కాపాడుకునే ప్రయత్నం ఇంటినుంచే చేస్తున్నారు. మరికొందరైతే ఇళ్లల్లోని గదులను జిమ్‌లుగా మార్చేసుకుని వ్యాయామాలు చేస్తున్నారు.

మహిళలకు ప్రత్యేకం

ఏ జిమ్‌కు వెళ్లినా మహిళలకు ప్రత్యేక విభాగాలు ఉంటున్నాయి. మహిళలు, యువతులు ప్రధానంగా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. జిమ్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలతో వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గడంతో పాటు స్టామినా పెంచుకుంటున్నారు. వ్యాయామాల ద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు తగ్గించుకోవడంతో పాటు సర్వసాధారణంగా మారిన బీపీ, గుండె పల్స్ రేటును నియంత్రించుకునేవిధంగా వివిధ రకాల వ్యాయామాలు చేస్తున్నారు. జిమ్‌లలో అత్యాధునిక పరికరాల ద్వారా వ్యాయామం చేయడం వల్ల శరీరం మృదువుగా మారుతుంది. మహిళలకు ప్రధానంగా స్విస్‌బాల్, ఎలిప్టికల్ ట్రైనర్, ట్రెడ్‌మిల్లర్, అప్ రైట్ బైక్, రెక్యుంబెంట్ బైక్, డబుల్ ట్విస్టర్, షైపర్ ఎక్స్‌టెన్షన్, రబ్బర్ డంబుల్స్, స్టీమ్‌బాత్, బ్లడ్ సర్క్యులేషన్ మిషన్, స్టిక్కింగ్, స్కిప్పింగ్, బాడీ స్ట్రెచింగ్ వంటివి ఎన్నో ఉన్నాయి.



ఒకప్పుడు ఇంటి పనులే మహిళలకు అన్ని రకాల వ్యాయామాలు (ఎక్సర్‌సైజ్‌లు)గా పనిచేసేవి. కాలం మారింది. పనులన్నీ యంత్ర పరికరాలే చేసుకుపోతుండటంతో మహిళలకు వ్యాయామం తప్పనిసరి అయ్యింది. జిమ్‌లవైపు వెళ్లలేని సాధారణ మహిళలు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో నడక వ్యాయామానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక మహిళా ఉద్యోగులెందరో జిమ్‌లలో తమ శరీరానికి సరిపడా వ్యాయామాలను ఎంచుకుని ఓ వైపు ఫిట్‌నెస్‌ను.. మరోవైపు ఆరోగాన్ని కాపాడుకుంటున్నారు. అందుకే ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఫిట్‌నెస్ జిమ్‌లు నేడు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయి. లింగ, వయో బేధాలు లేకుండా అందమైన శరీరాకృతిని నిలుపుకునే ప్రయత్నమే అందరిదీ. ఆధునిక సమాజంలో నిత్యం ఒత్తిళ్లకు లోనవుతున్న యువతులు, మహిళలు, విద్యార్థినులు యోగావైపు దృష్టిసారిస్తున్నారు. యోగాలోని పలు ఆసనాలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు.



చిక్కాలంటే... తప్పదు మరి









సదస్సుకు హాజరైన యువకులు, మహిళలు, కోనసీమ స్టార్టప్ సమ్మిట్ బ్రోచరును ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివశంకర్, అధికారులు

పరిశ్రమల స్థాపనకు
యువత ముందుకు రావాలి



- ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి
- 'కోనసీమ స్టార్టప్ సమ్మిట్'లో కార్మిక శాఖ మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం చోడవరం బైపాస్‌లోని విజయ ఫంక్షన్ హాలులో సోమవారం 'కోనసీమ స్టార్టప్ సమ్మిట్-2025 పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు, ఉపాధి అవకాశాల పెంపునకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. యువత ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరారు. ఎంఎస్ఎంఈల ద్వారా పరిశ్రమలు స్థాపించాలనే ఆలోచన ఉండి ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ఏడాదికి లక్ష 75వేల మంది పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎటువంటి హామీ లేకుండా రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు రుణం పొందే అవకాశాన్ని కోనసీమ జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ 2030 నాటికి ప్రతి ఇంటో నూ పారిశ్రామికవేత్త ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. యువత వినూత్నంగా ఆలోచించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ నిర్మూలనకు మంత్రి సుభాష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

ఫ్లిప్‌కార్ట్ డైరెక్టర్ డిప్పివంకాని మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కోనసీమ అనుకూలమైన ప్రాంతమన్నారు. ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులను ఫ్లిప్‌కార్ట్ ద్వారా అమ్మకాలు చేసుకునేందుకు కృషి చేస్తానన్నారు. కోనసీమ సమ్మిట్‌పై రూపొందించిన బ్రోచర్‌ను మంత్రి సుభాష్, ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆవిష్కరించారు. యువకులు, మహిళల సందేహాలను జిల్లా అధికారులు నివృత్తి చేశారు. సదస్సులో ఆర్డీవో అఖిల, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు ప్రసాద్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజరు మారుతి, సీడాప్ జేడీఎం కిరణ్, పశుసంవర్ధక శాఖ ఏడీ పెద్దిరాజు, లీడ్ బ్యాంకు మేనేజరు కేశవవర్మ, మత్స్య శాఖ ఏడీ కృష్ణ, జనసేన రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి సత్యం, చిక్కాల దొరబాబు, పెసంగి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు
దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని కాకినాడ జిల్లా సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. 2022, 23, 24 సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు https:// awards.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డుకు అర్హులన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం రూ.15లక్షల నగదు అందజేస్తారు.

సత్యదేవుని సన్నిధిలో
చెన్నై హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.మాల కుటుంబసభ్యులతో కలిసి సోమవారం విచ్చేశారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం చేయించి పండితులతో వేదాశీర్వచనం ఇప్పించారు. న్యాయమూర్తి దంపతులకు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని ఈవో అందజేశారు.



న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

డీజిల్ మాఫియాపై కదలిక



నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో బంకు లీజుదారుడు వీరబాబు నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

- బయో డీజిల్ బంకులో అధికారుల దాడులు
- ప్రధాన పాత్రధారుడు వైసీపీ నాయకుడే ..
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో వెలుగులోకి ... పురుషోత్తపల్లి బంకులో తనిఖీలు

నిడదవోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న డీజిల్ మాఫియాపై 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ మార్గాల్లో బంకులకు చేర్చి, అక్కడ నుంచి ప్రముఖ కార్పొరేట్ కంపెనీ హెచ్‌పీ లోగోను అడ్డం పెట్టుకుని అనుమతుల్లేని వాహనాల్లో జిల్లాలోని ఇసుక ర్యాంపులు, లారీ స్టాండులో ఉన్న వాహనాలకు డీజిల్‌ను సరఫరా చేసేస్తున్నారు. ఈ మాఫియా వెనుక ముఖ్యపాత్ర, సూత్రదారి వైసీపీ నేత కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలో ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒక బయోడీజిల్ బంకును జగ్గంపేట సమీపంలోని ఒక గ్రామానికి చెందిన వైసీపీ నేత వీరబాబు లీజుకు తీసుకుని ఈ డీజిల్ మాఫియాకు తెరలేపాడు. బయో డీజిల్ పేరుతో ఉన్న బంకులో నుంచి పొరుగు రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన డీజిల్, క్రూడ్ ఆయిల్ లాంటివి తెప్పించి ప్రముఖ అయిల్ కంపెనీ హెచ్‌పీ పేరుతో స్టిక్కరింగ్ చేయించి సుమారు 3000 లీటర్ల కెపాసిటీ కలిగిన ట్యాంకును బొలేరో వాహనానికి అమర్చి ట్యాంకుకు డిజిటల్ ఎక్విప్‌మెంట్‌తో పాటుగా డీజిల్ కొట్టేందుకు గన్‌ను ఏర్పాటు చేసి ఈ మాఫియా సాగిస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసింది. దీనిపై అధికారులు స్పందించి సోమవారం బంకుపై దాడులు నిర్వహించారు. డివిజినల్ ఏఎస్‌వో నాగాంజనేయులు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బంకు లీజుదారుడు వీరబాబు ఆధ్వర్యంలోనే తాళాలు వేసి వున్న బంకును తెరిపించి రికార్డులను పరిశీలించడంతో పాటు ఆయిల్ శాంపిల్స్‌ను సేకరించారు. దీనిపై పూర్తి నివేదికను జేసీ చినరాముడుకు అందిస్తామని తెలిపారు. ఈ దాడుల్లో రాజానగరం రంగంపేట సివిల్ సప్లయిస్ తహశీల్దార్ బాపిరాజు, పెరవలి సివిల్ సప్లయిస్ తహశీల్దార్ సుధీర్ రెడ్డి, నిడదవోలు సివిల్ సప్లయిస్ తహశీల్దార్ అనిల్ కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యేంద్ర, వీఆర్ వోలు సునీల్, రాంబాబు పాల్గొన్నారు.

- కొవ్వూరు డివిజన్ ఏఎస్‌వో నాగాంజనేయులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బయో డీజిల్ బంకులో భూమిపైన ఉన్న ఒక ట్యాం కులో నుంచి భూమిలోపల ఉన్న మరో ట్యాంకు నుంచి ఆయిల్ శాంపిల్స్ సేకరించామని, వీటిని విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి డీజిలో, బయోడీజిలో నిర్ధారణ చేసుకుని తదు పరి చర్యలు తీసుకుంటా మని తెలిపారు. అలాగే హెచ్‌పీ కంపెనీ పేరుతో అనుమతులు లేకుండా బంకు లీజుదారుడు వీరబాబు తిప్పు తున్న వాహనాన్ని గుర్తించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

131 కేజీల గంజాయి పట్టివేత

- నలుగురి వ్యక్తులు, మూడు కార్లు, రూ. 16,500 నగదు స్వాధీనం
- వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ హరిబాబు

అన్నవరం, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి అటవీప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 131 కేజీల గంజాయిని సోమవారం అన్నవరం పోలీసులు నెల్లిపూడి శివారు శంఖవరం కత్తిపూడి రోడ్డులో పట్టుకున్నారు. అలాగే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే .. ఏఎస్‌ఆర్ జిల్లా మాడుగుల మం డలానికి చెందిన పొంగి కృష్ణారావు, జగ్గందొర గోపాల్, గొల్లూరి మత్స్యరాజు రెండు కార్లలో గంజాయిని తెస్తూ నెల్లిపూడి సమీపంలో రాజమహేంద్రవరానికి చెందిన కొమలి రామకృష్ణకు చెందిన కారులోకి మార్చుతుండగా పట్టుకున్నారు. గంజాయిని పొంగి కృష్ణారావు వద్ద నుంచి కోమలి రామకృష్ణ తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు హైదరాబాద్, మహారాష్ట్రలో విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. నలుగురితో పాటు మూడు కార్లు, నాలుగు చరవాణీలు, రూ. 16,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ. 6.65 లక్షలు ఉంటుందని డీఎస్పీ వెల్లడించారు. అన్నవరం ఎస్ఐ హరిబాబు, అదనపు ఎస్ఐ ఎల్. ప్రసాద్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఏపీఈఏపీ సెట్‌లో 'ఆదిత్య' విద్యార్థుల జయకేతనం



పాలకుర్తి ఆదిత్య అభిషేక్ (13 ర్యాంక్) | గొల్లపల్లి లోషిణి 72వ ర్యాంక్ | వై.శుభశ్రీవల్లీ 91వ ర్యాంక్ | వి.సాయి భవ్య హర్షిణి, 31వ ర్యాంక్ | డి.దేవి సౌమ్యశ్రీ 112వ ర్యాంక్



పి.సాయిశ్రీధర్ 119వ ర్యాంకు

కాకినాడరూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ విడుదల చేసిన ఏపీఈ ఏపీ సెట్ ఫలితాల్లో కాకినాడ 'ఆదిత్య' విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.ఆదిత్య అభిషేక్ (13), జి.లోషిణి (72), వై.శుభశ్రీవల్లీఆత్రేయి (91), జి.శ్రీరామ శశాంక్ (95), వై.వేజిత్ (96) ర్యాంకులు సాధించారు. తమ విద్యార్థులు 121, 136, 156, 169, 170, 172, 177, 198 ర్యాంకులను కూడా కైవసం చేసుకున్నారని ఆ విద్యాసంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్ రెడ్డి సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీ విభా గంలో వి.సాయిభవ్య హర్షిణి (31), డి.దేవి సౌమ్యశ్రీ (112), పి.సాయిశ్రీధర్ (119), సీహెచ్ శ్రీవెంకటశివసాయి అచ్యుత (152) ర్యాంకు లు సాధించారు. 100 లోపు ఆరుగురు, 500లోపు 38 మంది, 1000 లోపు 62 మంది ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.

ముగిసిన అప్పనపల్లి బాలబాలాజీ తిరుకల్యాణోత్సవాలు



శ్రీపుష్పయాగంలో భాగంగా దీపాలు వెలిగించిన భక్తులు

మామిడికుదురు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారం నిర్వహించిన శ్రీపుష్ప యాగంతో ముగిశాయి. ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాస్, చినజీయర్‌స్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీపుష్పయాగంలో భాగంగా అర్చకులు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

నేడు మావోయిస్టుల దేశ వ్యాప్త బంద్

- పలు వాహనాల దారి మళ్లింపు
- పోలీస్ గస్తీ ముమ్మరం



నెల్లిపాక జంక్షన్‌లో వాహనాల దారి మళ్లింపు చేపడుతున్న సీఐ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

ఎటపాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త బంద్‌కు మంగళవారం మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా వాహనాల దారి మళ్లింపు చర్యలను సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. భద్రాచలం నుంచి వయా లక్ష్మీపురం మీదుగా చింతూరు, ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. భద్రాచలం - కూనవరం రోడ్డులో నెల్లి పాక నుంచి జగ్గవరం జంక్షన్ మీదుగా చట్టి వరకు వాహనాలు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ దారిలోనే వాహనాలు రాకపోకలు సాగించాలని సీఐ కన్నప రాజు సూచించారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత భద్రాచలం నుంచి ఘాట్ రోడ్, సీలేరు, కుంట వైపుకు వేళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను భద్రతా కారణాల రీత్యా రద్దు చేసినట్టు తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ అండ్ యాంకిల్ జోనల్ సీఎంఈ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆర్థో వైద్య నిపుణులు

జీజీహెచ్(కాకినాడ) జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలో ఫుట్ అండ్ యాంకిల్ సమస్యలపై ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అధ్యక్షతన సోమవారం జోనల్ సీఎంఈ జరిగింది. రాజమహేంద్రవరం జీఎస్ఎల్, అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాలల ఎముకల విభాగ పీజీలు, జూనియర్ డాక్టర్లు మొత్తంగా 130 మందికి సీఎంఈ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సీఎంఈ ద్వారా ఆధునిక వైద్య పద్ధతులు, సాంకేతిక అంశాలపై వైద్య నిపుణులు వైద్య విద్యార్థులకు విశదీకరించారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పివి ప్రసన్నకుమార్, జోనల్ సీఎంఈ కోఆర్డినేటర్ డాక్టర్ రమణకుమార్, డాక్టర్లు యెన్నపు నాగేశ్వరరావు, ముఖర్జీ, బీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, పురుషోత్తం, దక్షిణామూర్తి, శ్రీమన్నారాయణ, డాక్టర్ సాయికృష్ణ, అరుణకుమార్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

కరప, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరపకు చెందిన బి.గోవిందు-లీల దంపతులు స్థానికంగా జిలేబీ షాపు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వారి కుమార్తె పాయల్ స్థానిక హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం పదో తరగతి విద్యార్థి ఉష పుట్టినరోజు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన పాయల్ ఎంతకీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఆమె స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సాయంత్రం బాలిక తల్లి కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆటోను బైక్ ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు

వేర్వేరు ప్రమాదాల్లో మరో నలుగురు మృతి

తుని రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆటోను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరుగా యాలపాలైన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామ సమీపంలో జరిగింది. ఎన్ఎస్‌పీ నగరం నుంచి తునికి ద్విచక్రవాహనంపై బయల్దేరిన లోకా రాజబాబు(38), కొల్లు అప్పలకొండ, సప్పి దేవుడు కొలిమేరు వద్ద గూడ్స్ ఆటోను ఢీకొన్నాడు. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా లోకా రాజబాబు చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్..

బిక్కవోలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కుకు మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం..బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన వేమగిరి రాజేష్(30) పందలపాకలోని మట్టిని బట్టీలకు ట్రాక్టర్‌పై తోలుతున్నాడు. సోమవారం ట్రాక్టర్‌పై మట్టిని తరలిస్తుండగా ఇంజన్ మట్టిలో కూరుకుపోవడంతో ట్రక్కు శీల పిన్ విరిగిపోయింది. దీంతో ఇంజన్‌పై ట్రక్కు ప డడంతో రాజేష్ రెండింటికి మధ్యలో ఇ రుక్కుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రక్కు మధ్యలో ఇరుక్కుపోయి మృతిచెందిన రాజేష్

కంటైనర్‌కు విద్యుత్ వైర్ తగిలి..

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం ఖండ్రిక వద్ద కంటైనర్ లారీకి 6.2కేవీ లైన్ విద్యుత్ వైర్ తగిలి లారీ డ్రైవర్ మృతి చెందినట్టు కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. బీహార్‌కు చెందిన కంటైనర్ లారీ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో ఖండ్రిక వద్ద లారీని పక్కకు తీసి ఆపగా విద్యుత్‌లైన్ లారీకి తగిలి షాక్‌కు గురై డ్రైవర్ మృతిచెందాడు. మృతుడు బీహార్‌కు చెందిన కమల కి షోర్ షాగా గుర్తించారు. మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలివెల వీఆర్వో నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.





కంటైనర్‌ను తగిలిన విద్యుత్ వైర్, మృతుడు కమల కిషోర్‌షా

గోదావరిలో జారిపడి ఓ వ్యక్తి..

మామిడికుదురు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామానికి చెందిన మోటిపల్లి స్వామినాయుడు (36) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మరణించాడు. హైదరాబాద్‌లో టైలరింగ్ వృత్తి జీవనం సాగిస్తున్న స్వామినాయుడు శనివారం స్వగ్రామం వచ్చాడని బంధువులు తెలిపారు. కుమార్తెను, కుమారుడిని హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు వచ్చి సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి కనిపించకుండా పోవడంతో గాలింపు చేపట్టగా గోదావరిలో మృతదేహం లభ్యమైంది. దీనిపై నగరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైలు ఢీకొని ఒకరు..

తుని రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వేస్టేషన్ పరిధలో జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. మృతుడి ఒంటిపై ఎరుపు, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు నిక్కర్ ఉన్నాయని, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే ఎస్ఐని సంప్రదించాలని కోరారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆటో

కోరుకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వైపుగా వెళుతున్న టిప్పర్‌ను బూరుగుపూడిలో డ్రైవర్ పక్కకు ఆపాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న ఆటో వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో వృద్ధురాలి పరిస్థితి విషయంగా ఉంది. క్షతగాత్రులను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

ఆరుగురికి స్వల్ప గాయాలు

గుంటూరు నుంచి పొల్లూరు జలపాతానికి వస్తుండగా ఘటన



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మోతుగూడెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విహారయాత్రకు పొల్లూరు జలపాతానికి వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం జరిగింది. అందరూస్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి ఆరుగురు స్నేహితులు ఓ వ్యాన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతానికి బయల్దేరారు. మోతుగూడెం పరిధిలో సుకుమామిడి-తూలుకొండ రోడ్డులో వ్యాన్ సోమవారం ఉదయం 6గంటలకు అదుపు తప్పి టేకు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికీ చిన్న చిన్న గాయాలయ్యాయి. వారు అటుగా వస్తున్న ఆటో ఎక్కి మోతుగూడెం ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేయించుకున్నారు. ఎస్ఐ సాదిక్‌కు సమాచారం తెలియడంతో వారిని మెరుగైన వైద్యం కోసం చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



చెట్టును ఢీకొన్న వ్యాన్

రాజకీయాలకు జగన్ అనర్హుడు

ఎక్స్ వేదికగా యనమల రామకృష్ణుడు విమర్శలు



తుని రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రాజకీయాలకు అనర్హుడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. అమరావతి ప్రాంత మహిళలను అసభ్యకర పదజాలంతో సాక్షి మీడియా డిబేట్‌లో వైసీపీ నాయకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై యనమల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై యావత్తు మహిళ సంఘాలు ఆందోళన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి పెదవి విప్పకపోవడంతో దీని వెనుక జగన్ పాత్ర ఉందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని యనమల ఎక్స్ అకౌంట్‌లో ట్వీట్ చేశారు.మహిళలపై దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై కానీ, సాక్షి మీడియాపై కానీ జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని ప్రశ్నించిన యనమల కనీసం వ్యవహారాన్ని జగన్ రెడ్డి ఖండించకపోవడం క్షమాపణలు చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాలకు ఏ మాత్రం అర్హుడు కాదని యనమల పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో వైసీపీ నీచ సంస్కృతి బయట పడిందని అన్నారు.

రోజ్‌వుడ్ మంచాలు స్వాధీనం

మారేడుమిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న రెండు రోజ్‌ఉడ్ మంచాలను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సీలేరు నుంచి మోతుగూడెం మీదుగా రాజమండ్రి వెళుతున్న ఆర్టీసీ బస్సులో రెండు విలువైన రోజ్‌వుడ్ మంచాలనుతరలిస్తున్నారని అటవీ శాఖాధికారులు అందుకున్న సమాచారంతో మారేడుమిల్లి అటవీశాఖ కార్యాలయం వద్ద బస్సును ఆపి తనిఖీలు నిర్వహించి మంచాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణాపై పూర్తి సమాచారం కోసం విచారణ చేస్తున్నామని దీనిపై అటవీ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ చొరవతో ఆశ్రమానికి వృద్ధుడి అప్పగింత



వృద్ధుడిని ఆశ్రమానికి అప్పగించిన దృశ్యం

సామర్లకోట, మే 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సుమారు 79 సంవత్సరాల వయసున్న అనాథ వృద్ధుడిని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు గుర్తించి కాకినాడలోని వృద్ధాశ్రమానికి సోమవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు పరిధిలోని ఏలేరు ప్రాంతానికి చెందిన వాకపల్లి చిన్నరాజు కొన్ని రోజులుగా సామర్లకోట పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు గుర్తించి చేరదీసి అతడి నుంచి సమాచారం రాబట్టారు. ముందూ వెనుకా ఎవరూ లేరని నిర్ధారించి కాకినాడలోని జనావళి వలంటరీ ఆర్గనైజేషన్ అనే ఓల్డ్ ఏజ్ హోమ్‌నకు సంరక్షణార్థం అప్పగించారు.అతని సంరక్షణకు అయ్యే ఖర్చును గరగారావు భరించేందుకు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మానవత దృక్పథాన్ని, దాతృత్వాన్ని పలువురు అభినందించారు.

హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

యానాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యానాంలో మద్రాస్‌హైకోర్టు న్యాయమూర్తి ఎస్.మాలా పర్యటించారు. రెండు రోజులు పర్యటనలో భాగంగా ఆమె యానాం వచ్చారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో అమెను యానాం పరిపాలనాధికారి మునిస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

టీడీపీ పుల్లేటికుర్రు గ్రామకమిటీ ఎన్నిక

అంబాజీపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పుల్లేటికుర్రు గ్రామకమిటీ ఎన్నిక నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా పబ్బినీడి రాంబాబు, కార్యదర్శిగా దొమ్మేటి సురేష్, ఉపాధ్యక్షుడిగా కాసా నాగమల్లేశ్వరరావు, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

ఉక్కు పరిశ్రమ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

అమలాపురం, ముమ్మిడివరంలలో నిరసనలు

అమలాపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 4500 మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కొప్పుల సత్తిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చర్యలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. దీనిలో భాగంగానే కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. నిరసనలో సీఐటీయూ మండల కన్వీనర్ పి.అమూల్య, దైవకృప, రత్నకుమారి, పార్వతీ, ఉమ, నిమ్మకాయల శ్రీనివాస్, సతీష్, జనార్ధనరావు, సత్తిబాబు, రామారావు పాల్గొన్నారు.



అమలాపురంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

సొంత గనులు కేటాయించాలి

ముమ్మిడివరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 4500 కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్‌చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ కార్యాలయం నుంచి వారంతా ర్యాలీగా తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చర్యలు వేగవంతమయ్యాయని, దానిలో భాగంగానే 4500కాంట్రాక్టు కార్మికులను తొలగించారని ఆరోపించారు. పరిశ్రమకు సొంత గనులను కేటాయించకుండా నష్టాలకు ఉద్యోగులే బాధ్యులని కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, ఎం.శ్రీనివాసరావు, గుత్తుల రమేష్, దొండపాటి సతీష్, బుంగ లక్ష్మణ్, పలివెల ప్రసాద్, రేవు వెంకటలక్ష్మి, నవీన్, ధనుంజయ, పలివెల ఆనంద్, నిమ్మకాయల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనానికి యోగా దోహదం : కలెక్టర్

పలు మండలాల్లో యోగా ర్యాలీలు

అమలాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవన విధానానికి యోగా దోహద పడుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో కలెక్టరేట్ నుంచి నల్లవంతెన వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా జీవనశైలిలో భాగంగా రోజువారీగా యోగాసనాలు వేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ దేహదారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందన్నారు. ప్రజలు తమ జీవనశైలిలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలన్నారు. ర్యాలీలో తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, డ్వాక్రా మహిళలు, ఓంశాంతి నిర్వాహకులు, ఆయుష్ వైద్యులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం,(ఆంధ్రజ్యోతి): యోగా ఆరోగ్యవంతమైన ప్రపంచానికి ఒక దిక్సూచి వంటిదని ప్రజాప్రతినిధులు, ప్రజలు నినదించారు. గోపవరంలో సోమవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆధ్వర్యంలో యోగా ప్రయోజనాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తెలుగురైతు మండలాధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని ముమ్మిడివరం నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ టీవీ సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం ముమ్మిడివరంలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి టీటీఆర్ కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో మేనేజర్ పీవీ నూకరాజు, టీపీవో బి.రాజేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె.సత్యనారాయణరాజు, సచివాలయ, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో గొలకోటి దొరబాబు ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఇందుమతి కృష్ణవేణి, గొలకోటి తాతాజీ, సకిలే వెంకటేశ్వరరావు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అమలాపురంలో యోగా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


పి.గన్నవరంలో యోగా అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అధికారులు

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ నిత్యం యోగా చేస్తే దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం పి.గన్నవరం సచివాలయం నుంచి త్రిరోడ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి ఎంపీడీవోలు కేవీ ప్రసాద్, సరోవరరావు, ఏపీఎం మురళీకృష్ణ, ఏపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవన విధానానికి యోగా దోహద పడుతుందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. పొన్నమండ గ్రామ సచివాలయం-1, 2లో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కడలి దుర్గ, గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు దాకే ఏడుకొండలు, కార్యదర్శి విజయభాను, వీఆర్వో సీహెచ్ హరిబాబు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాజోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, సర్పంచ్ రేవు జ్యోతి, జగడం సత్యనారాయణ, అడబాల విజయ్, సెక్రటరీ రెహ్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు అన్నారు. మాచవరం పంచాయతీ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన యోగాంధ్ర ర్యాలీలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీడీవో భీమారావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, రవణం రాము, బుచ్చిబాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

నీటి వనరులను కలుషితం చేస్తున్నా పట్టించుకోరా!

● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలు సమస్యలపై వినతులు

అమలాపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మంది ప్రజల దాహార్తిని తీర్చే రక్షిత మంచినీటిని అందించే ప్రధాన పంటకాల్వలను కలుషితం చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని జనసేన నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఎ.బాలశ్రీనుబాబు పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు. అమలాపురం ప్రధాన పంటకాల్వలకు ఇరువైపులా ఉన్న అపార్టుమెంట్ల సముదాయాలు, ఆక్వాచెరువుల యజమానులు, హోటళ్ల నిర్వాహకులు ఉద్దేశపూర్వకంగా ప్రధాన పంటకాల్వను డ్రైనేజీగా ఉపయోగిస్తున్నారని వివరించారు. ఆక్వాచెరువుల వ్యర్థాలను సైతం పంటకాల్వల్లోకి విడిచిపెడుతున్నారు. కాల్వ నీరు కలుషితం కావడం వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. నీటి కలుషితంపై ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని తద్వారా స్వచ్ఛభారత్, పర్యావరణ పరిరక్షణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నాం
పేరూరు విశ్వేశ్వర అగ్రహారంవాసులు

దశాబ్దాల కాలంగా పేరూరు విశ్వేశ్వర అగ్రహారంలో జీవిస్తున్నాం. చిన్నపాటి ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉండడంతో తరచూ ట్రిప్ అయిపోతుంది. లైన్‌మెన్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా వచ్చి బాగు చేస్తున్నారు కానీ ఆయన అలా వెళ్లగానే మళ్లీ ట్రిప్ అయిపోతుంది. గత ఏడాది నుంచి ఇదే పరిస్థితి. విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ కోతలు, ట్రాన్స్‌ఫార్మర్ కొత్తగా లోడ్‌కు తగ్గట్టు ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి. కొంతరైతే పెరిగిన దోమలతో ఆరుబయటే నిద్రించాల్సిన పరిస్థితి ఉందంటూ అగ్రహారానికి చెందిన వి.కామేశ్వరరావు, పేరి విశ్వేశ్వరుడు, కేవీఎస్ శర్మ, ఎం.కామేశ్వరరావు, ఎస్వీ శాస్త్రి అర్జీ అందించారు.

దారి కల్పించాలి
శివకోడు పర్రభూముల రైతులు

శివకోడ-చింతలపల్లి మెయిన్‌రోడ్ నుంచి పవర్ స్టేషన్ ఎదురుగా వందలాది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రైతులు ధాన్యం, గడ్డి మోపులు తరలించుకునేందుకు ప్రభుత్వ పుంత దారి ఉంది. ఇటీవల కాలంలో కొందరు పుంత మార్గాన్ని ఆక్రమించుకుని అడ్డుకట్ట వేశారు. దీంతో పండించిన పంటలను బయటకు తీసుకువచ్చే దారి లేకుండా పోయింది. కనీసం గడ్డి మోపులు తరలించుకోలేకపోతున్నాము, రెవెన్యూ అధికారులు తక్షణం సర్వే నిర్వహించి ప్రభుత్వ పుంత మార్గానికి మోక్షం కల్పించాలని పర్ర భూములు రైతులు ఎస్‌వీవీఎస్ హనుమాన్, బళ్ల శివరావు, జి.ముసలయ్య, గుబ్బల సత్యనారాయన, నల్లి వెంకన్న అర్జీ అందించారు.


విద్యుత్ సమస్యలు వివరిస్తున్న పేరూరు విశ్వేశ్వర అగ్రహారంవాసులు

కాంట్రాక్టు కార్మికులను ఆదుకోవాలి

జిల్లాలోని గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తోన్న కార్మికులందరినీ ఆదుకోవాలని కోరుతూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. గ్రామ పంచాయతీల్లో ట్యాంకు వాచర్, ఎవెన్యూ వాచర్, గేట్‌వాల్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ వంటి పలు రకాల సేవల పేర్లతో దశాబ్దాల కాలంగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం. పదో తరగతి నుంచి డిగ్రీ, ఆపైన చదువుకున్నవారు ఉన్నారు. జిల్లాలో 396మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. అయితే రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో 45మంది కార్మికుల వివరాలను పరిశీలించి 15రోజుల్లోగా నివేదిక పంపాలని ఆదేశించారు. అయితే మిగిలిన కార్మికుల పరిస్థితి మాటేమిటి అంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పూర్తిస్థాయిలో కాంట్రాక్టు కార్మికుల వివరాలను ప్రభుత్వానికి పంపించి ఆదుకోవాలని జిల్లాశాఖ అధ్యక్షుడు దాకే జార్జి, గుంట్రు సత్యనారాయణ, కోలా నాగప్రసాద్, నల్లా సతీష్, గుత్తుల భైరవస్వామి కోరారు.

ఒంటరి మహిళ పెన్షన్ పునరుద్ధరించాలి

మగతోడు లేకుండా ఆడబిడ్డతో కలిసి ఒంటరిగా జీవిస్తున్నా. గతంలో ఒంటరి మహిళ పెన్షన్ అందించారు. అయితే తనతో పాటు కుమార్తె పేరు తల్లి రేషన్‌కార్డులో ఉండడంతో తల్లి శేషారత్నం వితంతు పెన్షన్ పొందుతుండడంతో ఒంటరి మహిళ పెన్షన్‌ను 2019లో నిలుపుదల చేశారు. మగతోడు లేకుండా ఆడబిడ్డతో జీవిస్తున్నాను. నిలుపుదలచేసిన ఒంటరి మహిళ పెన్షన్‌ను పునరుద్ధరించి ఆదుకోవాలని కంటిపూడి రజనీ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు.

పైపులైన్ల ద్వారా మురుగునీరు సరఫరా
అల్లవరం మండల సర్పంచ్‌లు

బోడసకుర్రులోని ఆర్‌డబ్ల్యుఎస్ మంచినీటి వాటర్ ప్లాంటు నుంచి మండలంలోని 17గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. వాటితో పాటు గోడి గురుకుల పాఠశాలలకు కూడా ఇక్కడ నుంచే తాగునీరు సరఫరా చేస్తారు. ఆర్‌డబ్ల్యూఎస్ మంచినీటి చెరువు వేసవి కావడంతో అడుగంటిపోయింది. దాంతో కింది భాగంలో ఉన్న మట్టి, మురుగు నీటిలో కలిసిపోయింది. సరైన క్లోరినేషన్ చేయడం లేదు. దాంతో పైపులైన్ల ద్వారా మురుగునీరు సరఫరా అవుతుందని, ఆ నీటిని బాటిళ్లలో చూపిస్తూ మండలానికి చెందిన సర్పంచ్‌ల బృందం పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు. బోర్ల ద్వారా సంపుల్లో నీటిని నింపి క్లోరినేషన్ చేసి తాగునీటిని సరఫరా చేస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోడూరుపాడు, బెండమూర్లంక, తాడికోన తదితర గ్రామాల సర్పంచ్‌లు నడింపల్లి సుబ్బరాజు, రొక్కాల విజయలక్ష్మి, ఎస్‌వీఎస్ నాగమణి, పిల్లా ప్రసాద్, రొక్కాల నాగేశ్వరరావు అర్జీలో కోరారు.

ప్లాస్టిక్ బూతంపై కవితా పోటీలు

అంతర్వేది, జూన్ 9(ఆంధ్రజ్యోతి):ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కవితల పోటీలు నిర్వహిస్తున్నట్టు చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. సఖినేటిపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ బూతం అనే అంశంపై నగదు బహుమతి కవితల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల10వ తేదీలోగా కవితలు పంపించాలని, శ్రీశ్రీకళావేదిక వాట్సాప్ గ్రూపుల్లో రాయాలని కోరారు. విజేతలకు ఈనెల22న కాకినాడ పీఆర్ కళావాల ఆవరణలో జరిగే శ్రీశ్రీకళావేదిక ద్విశతక కవి సమ్మేళనంలో నగదు బహుమతి, జ్ఞానిక, శాలువ, ప్రశంతాపత్రాలతో సత్కరిస్తారన్నారు. వివరాలకు 9440042520, 95501517 24, 79816 73553 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రధాని మోదీ పాలనలో దేశ సమగ్ర ప్రగతి


అంతర్వేది: మహిళలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పి.గన్నవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలన దేశ సమగ్ర ప్రగతికి అంకితమైందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. మోదీ పాలనకు 11ఏళ్లు పూర్తికావడంతో బీజేపీ మండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు అందించారు. జాతీయ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ దేశంలో మోదీ పాలన పేదరిక నిర్మూలన దిశగా సాగిందన్నారు. అనంతరం ముఖ్యఅతిధులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్, స్థానిక నాయకులతో కలిసి రోగులకు పాలు, పండ్లు అందించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. మరమ్మతులు చేపట్టి ప్రజాసేవకు వినియోగించాలని ఆసుపత్రి అధికారులను కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పాలనకు 11ఏళ్లు

అంతర్వేది, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలన పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా టేకిశెట్టిపాలెం, అంతర్వేదిదేవస్థానం, గొంది, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. సుపరిపాలన, సేవ, వికసిత్ భారత్, పేదల సంక్షేమ అభివృద్ధి విషయాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర బీజేపీ డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, పట్టాపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, పడాల శ్రీనివాసరావు, కటికిరెడ్డి శ్రీనివాసరావు, పడాల శివప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం,జూన్9ఆంధ్రజ్యోతి):మురమళ్ళ వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు యానా నికి చెందినభక్తురాలు రూ.10,000 అందించారు.

పెంట కాల్వగా ప్రధాన పంట డ్రెయిన్



అయినవిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సాగునీరు, తాగునీరు అందించే ప్రధాన పంటకాల్వ (బొబ్బర్లంక-అన్నంపల్లి) పెంటకాల్వగా దర్శనమిస్తోంది. ఖరీఫ్ సమయం ఆసన్నమవడంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. ప్రధాన పంటకాల్వలో ఉన్న చెత్తను తొలగించకపోవడం, కాల్వ ఆక్రమణలకు గురికావడంతో శివారు భూములకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు అంటున్నారు. చాలాచోట్ల డంపింగ్ యార్డులు లేకపోవడం వల్ల ప్రధాన పంటకాల్వ వద్ద చెత్తను డంప్ చేస్తున్నారు. క్లోజర్ సమయం ముగుస్తున్నా కాల్వల్లో తూడు, చెత్తను తొలగించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకాల్వల్లో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా అక్షర ఇంటర్నేషనల్ స్కూలు ప్రారంభం

హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు


అక్షర ఇంటర్నేషనల్ స్కూలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు, బీవీసీ సంస్థల చైర్మన్ కనకయ్య, పాండురంగారావు తదితరులు

అమలాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గుడ్డివారి చింత సమీపంలో నిర్మాణమైన బీవీసీ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కళాశాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. టీడీపీకి చెందిన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, వైసీపీకి చెందిన ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు హాజరై అక్షర పబ్లిక్ స్కూలు దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బీవీసీ విద్యాసంస్థలు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో అత్యాధునిక హంగులు ఏర్పాటు చేయడాన్ని కార్యక్రమానికి హాజరైన ప్రతీ ఒక్కరూ స్వాగతించి ఇందుకు కారకులైన బీవీసీ విద్యా సంస్థల చైర్మన్ బోనం కనకయ్య, బండిగుప్తాపు పాండు రంగారావు, బోనం కృష్ణసతీష్, బోనం విజయలక్ష్మిలను అభినందించారు. ఈసందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, ఎంపీపీ యిళ్ల శేషారావు, గ్రామ సర్పంచ్ నడింపల్లి సుబ్బరాజు, కేవీ, నిమ్మకాయల రంగనాథ్, డీఎస్పీ ఆర్కే ప్రసాద్, సీఐలు డి.ప్రశాంత్‌కుమార్, పి.వీరబాబు, బీజేపీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, మోకా వెంకటసుబ్బారావు, తిక్కిరెడ్డి వాసులతో పాటు బీవీసీ విద్యా సంస్థల చైర్మన్ బోనం కనకయ్య, బోనం సతీష్ బోనం విజయలక్ష్మి, బండిగుప్తాపు పాండురంగారావు, డాక్టర్ వరహాలు, అనేక మంది ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. హాజరైన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలను అక్షర ఇంటర్నేషనల్ తరుపున ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీ,నాగుల్లంక పిహెచ్‌సీల్లో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పి.గన్నవరంలో వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగాఈశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ గర్భిణులకు పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. నాగుల్లంక పీహెచ్‌సీలో డాక్టర్ ఆర్.మౌనికమణి 33మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిం చారు. అనంతరం బోళ్ల మురళీమోహనరావు ఆధ్వర్యంలో గర్భిణులకు, సిబ్బందికి భోజనాలు అందించార్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు గుడాల సంపత్‌రావు, కోట రాజేందర్, ఎంపీహెచ్ఇవో ఎ.నాగరాజు, ఎంపీహెచ్ ఎస్‌లు మూర్తి, మరియమ్మ, నల్లా పెద్దకాపు, తోలేటి సారధి, తోరం సింహచలం పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులుగా గుర్తించండి

కాట్రేనికోన, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ట్యాంక్ వాచర్, ఎవెన్యూ వాచర్, గేట్‌వాల్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ తదితర విభాగాల్లో సేవలందిస్తున్న తమను గుర్తించాలంటూ జిల్లాలోని 396మంది కార్మికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో కేవలం 45మంది పంచాయతీ కార్మికులు మాత్రమే ఉన్నట్టు, వారి వివరాలను సమర్పించాలంటూ జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులకు సూచించారు. నిజానికి ఈ 45మంది కాకుండా ఇంకా 396మంది కార్మికులు ఉన్నారని, తమ వివరాలను ఉన్నతాధికారులకు పంపించాలని కార్మికులు కోరుతున్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసిన బ్యాడ్మింటన్ అసోసియేషన్

అమలాపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో నెల రోజులు నిర్వహించిన బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపు సభ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు మెట్ల రమణబాబు అధ్యక్షతన నిర్వహించారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీమెట్ల రామమూర్తి సరస్వతి మెమోరియల్ సౌజన్యంతో సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను అందించారు. తండ్రి పేరుమీదుగా కాశీ బ్యాడ్మింటన్ అకాడమీని ప్రారంభిస్తున్నట్టు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్ ప్రకటించారు. క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి యాళ్ల నాగసతీష్, రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి తిక్కిరెడ్డి శ్రీనివాస్, తిక్కిరెడ్డి సురేష్, క్రీడాభారతి అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, పాయసం శ్రీనివాస్, పీఈటీలు పాల్గొన్నారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు

అమలాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు నాబార్డు, జిల్లా లీడ్‌బ్యాంక్, జిల్లా పరిశ్రమ కేంద్రం, ఉద్యానశాఖ అధికారులు కేరళలోని తిరుపూర్ పారిశ్రామికవేత్తల సమన్వయంతో సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కేరళలోని కన్నూర్, పొల్లాచి, తిరుప్పూర్, కోయంబత్తూర్‌లోని పరిశ్రమల మేనేజింగ్ డైరెక్టర్ రవిబికాల్, ఎన్నార్కే పరిశ్రమల శాస్త్రవేత్త వేణుగోపాల్, ఇతర అధికారులతో కొబ్బరి విలువఆధారిత పరిశ్రమల ఏర్పాటు, ఉత్పత్తుల తయారీ విధానాలు, స్థానికంగా ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై సమీక్షించారు. ఐదు రకాల ఉత్పత్తులైన కొబ్బరి పౌడర్, పాలు, లేబర్ వాటర్ తయారీ, స్పెషల్ స్వీట్‌తయారీ అంశాలపై స్థానిక పెట్టుబడిదారులను, రైతుఉత్పత్తిదారుల సంఘాలతో సంప్రదించి పరిశ్రమల ఏర్పాటుపై వారిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి ఉత్పత్తులకు విదేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయని గుర్తించారు. ఎల్‌డీఎం కేశవవర్మ, డీఆర్‌డీఏ పీడీ జైచంద్రగాంధీ పాల్గొన్నారు.

ఢిల్లీ ప్రతినిధి మల్లాడికి ఘన సత్కారం


మల్లాడిని సత్కరిస్తున్న సీఎంరంగసామి, మంత్రులు, ఎమ్మెల్యేలు

యానాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు వేడుకను పురస్కరించుకుని పుదుచ్చేరి సీఎం ఎన్.రంగసామి ఇతర మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు ఘనంగా సత్కారించారు. సోమవారం ఉదయం మల్లాడి పుదుచ్చేరి చేరుకోవడంతో పుదుచ్చేరిలోని మల్లాడి స్వగృహానికి సీఎంతో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు చేరుకున్నారు. ఈసందర్భంగా వారికి మల్లాడి స్వాగతం పలికారు. అనంతరం సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రులు లక్ష్మీనారాయణ, విఫ్ ఏకేడీ ఆర్ముగం, ఎమ్మెల్యే భాస్కర్, ప్రకాష్ తదితరులు మల్లాడిని సత్కరించి పుష్పగుచ్ఛంలను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించుకున్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

ముమ్మిడివరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బస్టాండు సెంటర్‌లో సెంటర్‌లో ఉన్న శ్రీసద్గురు సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ పలువురు దంపతులతో సాయిబాబాకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం

అమలాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అల్లవరం శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి ఈనెల 6వరకు గ్రంథాలయ నిర్వాహకురాలు వి.ద్వారకామణి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు ఘనంగా జరిగాయి. శిక్షణ కార్యక్రమం ముగింపునకు ఏజీఎస్ ప్రకాశరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచి న్యూస్ పేపర్లు, పుస్తక పఠనాలు చేయడం ద్వారా మంచి విజ్ఞానం సముపార్జించుకోవచ్చునని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనంతో పాటు వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు ప్రకాశరావు మాస్టారు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. గ్రంథాలయ అధికారిణి ద్వారకామణి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.

ట్యాంకరు ద్వారా తాగునీరు

మామిడికుదురు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నామని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మగటపల్లి, కొమరాడ, ఈదరాడ గ్రామాల ప్రజలకు తాగునీటిని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నగరంలో కూడా ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

రోడ్డుపైనే మట్టి.. ప్రయాణికులకు కష్టాలు



మామిడికుదురు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్త రోడ్డు సమీపంలో 216 జాతీయ రహదారిపై లారీ ఆగిపోవడంతో లారీలో ఉన్న మట్టిని రోడ్డుపైనే దింపేశారు. రోడ్డుకు అడ్డంగా మట్టిని దింపడం వల్ల జాతీయ రహదారిపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరు గంటలసేపు రోడ్డుపై మట్టి ఉండడంతో పలు సమయాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసుల సహకారంతో మట్టిని తొలగించడంతో సమస్య పరిష్కారమైంది

సత్ఫలితాలు ఇచ్చిన వేసవి విజ్ఞాన శిబిరాలు

హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

ఉప్పలగుప్తం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు తమ పిల్లలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తక పఠనం, కథలు రచించడం ఎలా? ఇలా ఎన్నో విభాగాల్లో కవులు, రచయితలు ఇచ్చిన శిక్షణ అమూల్యమైనదని తల్లిదండ్రులు వ్యాఖ్యానించారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఆటలు, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర అంశాల్లో విజేతలకు బహుమతులందించారు. గ్రంథాలయాధికారులు నిమ్మకాయల శేషుకుమార్, సలాది నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, కవులు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, విశ్రాంత పీఎఫ్ ఏసీ అద్దంకి అమరేశ్వరరావు, గొలకోటి తాతాజీ, దేశంశెట్టి మల్లిక, ఆకేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

అయినవిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని చెన్నై హైకోర్టు న్యాయవాది ఎస్.మాలా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలం వనరుల కేంద్రం వద్ద సోమవారం ముమ్మిడివరం మండల శాఖ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షురాలు పి.హిమబిందు అధ్యక్షతన ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్టీయూ సంఘ కృషిని పీవీవీ సత్యనారాయణరాజు వివరించారు. ఎస్టీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటేశ్వరరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మణకుమార్, కె.వెంకటలక్ష్మి, శ్రీధర్, పీవీ కృష్ణమోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,558 విరాళం

అంతర్వేది, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన శ్రీపాద లక్ష్మీనరసింహమూర్తి-సీతామహాలక్ష్మి దంపతులు రూ.50,558 నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళంగా అందించారు. విరాళా దాతలకు ఆలయ ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం అంగరలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. ఈ శిక్షణ తరగతులు 90 రోజులపాటు నిర్వహిస్తామని, 75 శాతం హాజరు ఉండాలన్నారు. అంగర, పడమరఖండ్రిక, వెదురుమూడి గ్రామాలకు చెందిన 137 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ట్రైనింగ్ శిక్షకులు ఎం.సుధ, ఆపరేటర్ ఎ.కీర్తి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, కూటమి నాయకులు గుడాల జయబాబు, బలవరెడ్డి సత్తిబాబు, అల్లూరి రామకృష్ణ చౌదరి, నెక్కంటి శ్రీరాంజీ, షేక్ కరీం, త్రిపుర శెట్టి నాని తదితరులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేత

ఆలమూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్ పురస్కారాలకు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైయ్యారు. వీరికి సోమవారం అమలాపురంలో కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి సూరప రెడ్డి కీర్తిభవన, పిల్లి పృథ్వీనాథ్, సుకర సిరిసత్య శృతి, గాడా మానస, పిల్లి హారిక, జిల్లెళ్ల ధీరజ్ లకు షైనింగ్‌స్టార్ అవార్డులను అందజేశారు. వీరికి రూ.20వేల నగదు, ప్రశంసాపత్రంతో పాటు మెడల్ అందించారు. అవార్డులు పొందిన విద్యార్థులను పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. కె.గంగవరం ఉన్నత పాఠశాల నుంచి కడలి లేఖన, దంగేరు ఉన్నత పాఠశాల నుంచి మల్లిపూడి సాయివెంకట శ్రీగణేష్, అల్లా బాలగంగాధర్, కుందూరు ఉన్నత పాఠశాల నుంచి దాకే తేజ, పంపన సుష్మ ప్రణీతలు వీరికి సోమవారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ అవార్డుతో పాటు రూ. 20వేల నగదు అందజేశారు. వీరిని ఎంఈవో 1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.


కలెక్టర్ నుంచి అవార్డు తీసుకుంటున్న విద్యార్థి

బీజేపీ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దివస్

కొత్తపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దివస్‌ను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వాడపాలెంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు తొగర ఆంజనేయుడు, సంపతి కనకేశ్వరరావు, పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.


వాడపాలెంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యానందం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.57 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,57, 603 వచ్చినట్లు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి


రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం అంచెలంచెలుగా అమలు చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల రైతులకు వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి రమేష్‌కుమార్, గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, కూళ్ళ డీసీ చైర్మన్ మేకా శివప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు బలవరెడ్డి సత్తిబాబు, పుత్సల శ్రీనివాస్, నెక్కంటి శ్రీరాంజీ, పర్వతిన మురళీకృష్ణ తదితరులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు గ్రామాల రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే


ఏడిద సీతానగరంలో ఎమ్మెల్యేకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మండపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడిద సీతానగరం గ్రామంలో కూటమి నాయకులు ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సోమవారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణను కూటమి నాయకులు సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీతానగరం వంటి మారుమూల గ్రామాల్లో ఇటువంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేత్ర వైద్య బృందం పాల్గొని వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేశవరం, జడ్.మేడపాడు ఆర్వోబీలకు గ్రీన్ సిగ్నల్

మండపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరం, జడ్.మేడపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండపేటలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్వోబీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. కేశవరం, జడ్.మేడపాడు ఆర్వోబీలతో పాటు కడియం, అనపర్తి ఆర్వోబీలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ నాలుగు ఆర్వోబీలకు సంబంధించి రూ.200 కోట్లు టెండర్లు పిలిచారన్నారు. ఈనెల 23 టెండర్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీగా తెలిపారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు

అమలాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు నాబార్డు, జిల్లా లీడ్‌బ్యాంక్, జిల్లా పరిశ్రమ కేంద్రం, ఉద్యానశాఖ అధికారులు కేరళలోని తిరుపూర్ పారిశ్రామికవేత్తల సమన్వయంతో సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కేరళలోని కన్నూర్, పొల్లాచి, తిరుప్పూర్, కోయంబత్తూర్‌లోని పరిశ్రమల మేనేజింగ్ డైరెక్టర్ రవిబికాల్, ఎన్నార్కే పరిశ్రమల శాస్త్రవేత్త వేణుగోపాల్, ఇతర అధికారులతో కొబ్బరి విలువఆధారిత పరిశ్రమల ఏర్పాటు, ఉత్పత్తుల తయారీ విధానాలు, స్థానికంగా ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై సమీక్షించారు. ఐదు రకాల ఉత్పత్తులైన కొబ్బరి పౌడర్, పాలు, లేబర్ వాటర్ తయారీ, స్పెషల్ స్వీట్‌తయారీ అంశాలపై స్థానిక పెట్టుబడిదారులను, రైతుఉత్పత్తిదారుల సంఘాలతో సంప్రదించి పరిశ్రమల ఏర్పాటుపై వారిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి ఆధారిత ఉత్పత్తులకు విదేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయని గుర్తించారు. ఎల్డీఎం కేశవవర్మ, డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అయినవిల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని చెన్నై హైకోర్టు న్యాయవాది ఎ న్.మాలా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు జరిపారు. స్వామివారి దర్శనం అనంతరం వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



మండపేటలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆలమూరులో యోగాపై అధికారులు, నాయకుల అవగాహన ర్యాలీ

యోగాతో ఆరోగ్యవంతమైన జీవనం

ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు

మండపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనం యోగాతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండపేటలో మెప్మా ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే జోగేశ్వరరావు, నీటిపారుదల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ అందె శ్రీనివాస్, టీడీపీ నాయకులు కడియాల వెంకటలక్ష్మి, ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఎన్నో లాభాలు

రాయవరం, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని మాచవరం సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి అన్నారు. సోమవారం మాచవరం, వెదురుపాక గ్రామాల్లో యోగాంధ్రలో భాగంగా యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. తొలుత గ్రామంలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించిందుకు గ్రామంలో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, టీడీపీ నాయకులు మేడపాటి రవీంద్రారెడ్డి, రిమ్మలపూడి సత్యనారాయణ, త్రిపర్తి రమేష్, గండి చంద్రశేఖర్, కోడి చిన్న అప్పారావు, వెదురుపాకలో కొవ్వూరి చంటి రెడ్డి, యానిమేటర్ ఎం.శ్రీదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలమూరులో యోగా ర్యాలీ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరులో సోమవారం అధికారులు, నాయకుల అధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, హౌసింగ్ ఏఈ డి.శ్రీనివాస్, ఎంపీవో అరుణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పద్మ, నాయకులు ఈదల నల్లబాబు, గారపాటి శ్రీనివాసరావు, రామానుజుల శేషగిరిరావు అధ్వ ర్యంలో సాగిన ఈ ర్యాలీలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు.



కొత్తపేట మండలం వాడపాలెంలో జరిగిన యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆరోగ్యం పదిలం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ కుండా అన్నపూర్ణ పేర్కొన్నారు. సోమవారం ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలస్థాయిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంఈవో ప్రసాదరావు తదితర అధికారుల బృందం ఆరోగ్యకరమైన సమాజానికి ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

జీవితంలో భాగం కావాలి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం వాడపాలెంలో జరిగిన యోగాంధ్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మనస్సును, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే శక్తిగా యోగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అందరితో యోగా ప్రతిజ్ఞ చేయించారు. యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్సామాబాబు, బూసి భాస్కరరావు, బండారు బుల్లి తాత, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి నాగమణి అధ్యక్షతన యోగాపై అవగాహన ర్యాలీ సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, కూటమి నాయకులు చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, అంబటి కిషోర్, తమలంపూడి రామకృష్ణారెడ్డి, కోట రమణిదుర్గ, ఎంపీడీవో మహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో జి.కృష్ణ, కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజలు


రావులపాలెంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు

విద్యార్థిని చదువుకు పూర్వ విద్యార్థి ఆర్థికసాయం

ఆలమూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజుకు ఖర్చు చేసే రూ.10వేలను ఒక పేద విద్యార్థినికి పూర్వపు విద్యార్థి ఆర్థికసాయంగా అందించారు. చెముడులంక జడ్పీ హైస్కూల్‌లో పూర్వపు విద్యార్థి దూలం శ్రీనివాస్ వ్యాపారరీత్యా తాడేపల్లిగూడెంలో స్థిరపడారు. బడుగువానిలంకకు చెందిన పేద విద్యార్థిని రమాదేవి జడ్పీ హైస్కూల్ స్థాయిలో పదో తరగతిలో 564 మార్కులతో ద్వితీయస్థానం సాధించింది. ఆమె తండ్రి చిన్నతనంలో చనిపోగా తల్లి కూలిపనులతో జీవనం సాగిస్తూ కుమార్తెను చెముడులంక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివించింది. పదో తరగతిలో మంచి మార్కులు సాధించడంతో పాలిటెక్నిక్‌కు దరఖాస్తు చేయగా సూరంపాలెం ఆదిత్య కాలేజీలో డిప్లొమా కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో ఉచిత సీటు సాధించింది. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న శ్రీనివాస్ రూ.10వేల ఆర్థికసాయం అందించి ఆ మొత్తాన్ని గ్రామానికి చెందిన నాయకులు పాలూరి గోవిందరాజు, దూలం తేజ, బండారు చిన్న చేతుల మీదుగా విద్యార్థినికి సోమవారం అందజేశారు.


టీడీపీ కార్యాలయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

పాఠశాలల్లో సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష

రావులపాలెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యాశాఖాధికారులతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రతి విద్యార్థి తాను చదువుతున్న తరగతులలో మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు కూడా కృషి చేయాలన్నారు.

కేశవరంలో గన్ని పోతురాజు విగ్రహావిష్కరణ

మండపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేశవరంలోని గనిపోతురాజు ఆలయం వద్ద స్వామివారి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ చైర్మన్ ఆళ్ల రాజు స్వాగతం పలికారు. పోతురాజు స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, టీడీపీ నాయకులు యరగతపు బాబ్జీ, కర్రి తాతారావు, ఉండమట్ల సురేష్, ఉండమట్ల బాబి, కర్రి కాళీ, ఉండమట్ల రామకృష్ణ, ప్రసన్న, కూను సత్యనారాయణ, పిల్లి సత్యవాణి, సూరిబాబు, మానే వెంకన్న, కుసు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో కేంద్ర అయోజిత పథకాలతో తోడ్పాటు

కె.గంగవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సాగులో కేంద్ర ప్రభుత్వ అయోజిత పథకాలు ఎంతగానో తోడ్పాటునిస్తాయని ఐసీఏఆర్ శాస్త్రవేత్త కె.రాజశేఖర్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా దంగేరు సొసైటీ ఆవరణలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యవసాయం లో డ్రోన్‌ల వినియోగం, భూసార పరీక్షలు, పీఎం కిసాన్ ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించడం తదితర పథకాలపై వివరించారు. రైతులకు భూసార పరీక్ష రిపోర్టులు, మినీకిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏ.వో. మనోహర్, సంజయ్ హగ్డే, స్థానిక ఉద్యానవన అధికారి అనూష, మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి, పలు గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


దంగేరులో రైతులకు మినీకిట్‌లు అందజేస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్


ఇజ్రాయిల్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

ఇజ్రాయిల్‌కు పలువురు పరామర్శ

కె.గంగవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పితృ వియోగంతో బాధపడుతున్న మసకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మేడిశెట్టి ఇజ్రాయిల్‌ను మాజీ మంత్రి, వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ సోమవారం పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు వి.శ్యామ్, పిల్లి కళ్యాణ్, అనసూరి సతీష్ తదితరులు ఇజ్రాయిల్‌ను పరామర్శించారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

కపిలేశ్వరపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల పర్యటనలో భాగంగా ఎంఎస్‌సీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళి జయరాజు మాదిగ సోమవారం పడమరఖండ్రికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం మండపేటలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సాయంత్రం నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రామ, మండల స్థాయి నూతన కమిటీలు, నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు నిరసన


బోసుబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయు నాయకులు

ద్రాక్షారామ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను ఆపాలని, తొలగించిన 5400 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. ఉద్యోగ సంఘ నాయకులను బెదిరిస్తున్నారని సీఐటీయు నాయకుడు బలరాం ఆరోపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, జిల్లా నాయకులు మేడిశెట్టి దుర్గమ్మ, మలకా సుభాషిణి, ఆదిలక్ష్మీ, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.


స్వామివారికి వెండి ఆభరణం అందజేస్తున్న భక్తులు

భీమేశ్వరునికి వెండి శంఖం అందజేత

ద్రాక్షారామ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన తంగిరాల రవికిరణ్, నాగలక్ష్మీ శైలజ దంపతులు 328 గ్రాముల వెండి శంఖం సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన అనుమోలు దేవా కుటుంబ సభ్యులు 8 కూలర్స్ అందజేశారు. వీరికి ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గాభవానీ స్వామివారి ప్రసాదం, చిత్రపటాలు అందచేశారు.

ఘనంగా బలుసులమ్మ జాతర

రాయవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి జాతరను సోమవారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో వచ్చే పౌర్ణమి ముందు రోజున అమ్మవారి జాతర పౌర్ణమి రోజున తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలకు గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

అంతర్వేది, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన శ్రీపాద లక్ష్మీనరసింహమూర్తి-సీతామహాలక్ష్మి దంపతులు రూ.50,558 నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళంగా అందించారు. విరాళ దాతలకు ఆలయ ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

భూమి కౌలు అమరికం బహిరంగ వేలం ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా, రామచంద్రపురం మండలంలో ఓదూరు, యనమదల గ్రామాలలో ఆలయాలకు చెందిన సాగుభూములు, చెరువులు 3 సం.లు కాలపరిమితికి అనగా **2025-2026** నుండి **2027-2028** వరకు కౌలుకు అమరికం చేయుటకు దేవదాయశాఖ తనిఖీదారు సమక్షంలో బహిరంగ వేలంపాట జరుపబడును. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చును.

వ. నెం	దేవాలయము పేరు గ్రామము	భూమి వున్న గ్రామము	సర్వేనెం	విస్తీర్ణం య.సెం	ప్రథమ ధరావత్తు	వేలంపాట జరుగు ప్రదేశం తేది, సమయం
1	శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం	ఓదూరు	45/3	0.19	3000	శ్రీసోమేశ్వర,గోపాలస్వామి వార్ల దేవస్థానం, ఓదూరు 20.06.2025 తేది, ఉదయం 10 గం.
2			117/3	1.13	5000	డిటో
3			169/5	0.20	3000	డిటో
4			37/6	0.14	3000	డిటో
5			35/1	0.58	3000	డిటో
6			114/3	0.40	3000	డిటో
2	శ్రీ సోమేశ్వర స్వామి వారి దేవస్థానం (spefic)	ఓదూరు				
1		ఓదూరు	94/1	0.04		
		ఓదూరు	122/2	0.49		
				0.53	3000	డిటో
2		ఓదూరు	39/5	0.80		
		ఓదూరు	55/3	0.74		
		ఓదూరు	55/5	1.14		
		ఓదూరు	74/6	0.06		
	చెరువు	ఓదూరు		**2.74**	25000	డిటో
3	చెరువు	ఓదూరు	241/7	**0.92**	25000	డిటో
3 1	శ్రీ గోపాల స్వామి వారి దేవస్థానం (spefic)		82/2	0.40		
			87/2A	0.25		
			87/2B	0.02 **0.67**	3000	డిటో
2			186/3	0.79	3000	డిటో
4	శ్రీ గోపాల స్వామి వారి దేవస్థానం		116 109/4 184/8	5.87 2.95 0.06		
				3.01	15000	డిటో
5	శ్రీమల్లేశ్వరస్వామి దేవాలయం, యనమదల					శ్రీమల్లేశ్వరస్వామివారి ఆలయం,యనమదల 20-6-2025 మధ్యాహ్నం 3 గంటలకు
1		యనమదల	80	4-21	10,000	
2		యనమదల	80	4-21	10,000	
3		యనమదల	24/5 25/5	0.37	5000	

ప్రథమ దరావత్తు చెల్లించి, సాల్వెన్సీ సమర్పించి పాటలో పాల్గొనవలెను. పాటదారుడు పాట అయిన వెంటనే ఒక సంవత్సరం శిస్తు అడ్వాన్సుగా చెల్లించవలెను. మిగిలిన పాట షరతులు కార్యాలయం పనివేళల్లో గాని పాటసమయంలో గాని తెలుసుకోవచ్చును.
ఓదూరు
తేదీ 9-06-2025 కార్యనిర్వహణాధికారి